పోలింగ్‌కు సర్వం సిద్ధం

సాయుధ దళాలతో బందోబస్తు

- విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలో డీఆర్‌సీ కేంద్రం నుంచి ఈవీఎంల సరఫరా
- రంగంలోకి అదనపు బలగాలు

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా సోమవారం జరిగే పోలింగ్ కోసం పోలీసులు, జీహెచ్ఎంసీ ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలకు చెందిన డీఆర్‌సీ కేంద్రం అయిన యూసుఫ్‌గూడలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం నుంచి ఈవీఎంల సరఫరా జరిగింది. ఉదయమే పోలింగ్ సిబ్బంది వచ్చి డీఆర్‌సీ సెంటర్‌లో తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. మధ్యాహ్నం వరకు పోలింగ్ కేంద్రాల కేటాయింపు జరిగింది. పోలింగ్ కేంద్రాల్లో ఎలా ఉండాలి, ఎన్నికల కమిషన్ నిబంధనలపై ఉన్నతాధికారులు సిబ్బందికి అవగాహన కలిగించారు. పోలింగ్ సిబ్బందికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికారులు చెప్పారు. భోజనం, తాగునీరు కూడా నేరుగా పోలింగ్ కేంద్రాలకే వస్తాయని, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో ఈవీఎంను వదిలి బయటకు రావద్దని హెచ్చరించారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు ఫిర్యాదులు అందితే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

డీఆర్‌సీ కేంద్రంలో పోలీసులు క్యాంపు ఏర్పాటు చేసి భద్రతా చర్యలను పర్యవేక్షించారు. సిబ్బందికి స్టేడియంలోనే భోజన వసతి ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల తరువాత ఈవీఎం మెషీన్ల సరఫరా మొదలైంది.



డీఆర్‌సీ సెంటర్‌లో పోలింగ్ సిబ్బంది

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఎన్నికల పోలింగ్‌లో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలతో పాటు పోలీసు నిఘా ఉంటుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ బలగాలను సిద్ధం చేశాం. పోలింగ్ బూత్ ఏజెంట్లు ఎన్నికలు నిర్వహించే సిబ్బంది సూచనల మేరకు నడుచుకోవాలి. ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెట్టాం.

\- శ్యామల వెంకట్‌రెడ్డి, నోడల్ అధికారి, బంజారాహిల్స్ ఏసీపీ

ప్రత్యేక రెవెన్యూ రూట్లు

పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఈవీఎం మెషీన్ల కోసం ప్రత్యేక రెవెన్యూ దారులు ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి 25, ఖైరతాబాద్‌కు 22 దారులు సిద్ధం చేశారు. ఈవీఎం మెషీన్లతోపాటు పోలింగ్ సిబ్బందికి భద్రత కల్పించేందుకు ఓ ఎస్ఐ స్థాయి అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, సాయుధ పోలీసు ఉంటారు. వీరు పోలింగ్ పూర్తయి ఈవీఎంలు తిరిగి డీఆర్‌సీ సెంటర్‌కు వచ్చే వరకు పహారా కాస్తారు. ఈ వాహనాలకు ట్రాఫిక్ ఆటంకాలు కలగకుండా ట్రాఫిక్ పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. పోలింగ్ కేంద్రాల వద్ద కానిస్టేబుళ్లను భద్రతగా ఉంచుతారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సాయుధ పోలీసులు పహారా కాస్తుంటారు. సెక్టార్ల వారీగా ఎస్ఐలు, ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తుంటారు. బందోబస్తులో ఉన్న సిబ్బందికి సమయానికి ఆహారం అందించేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఉన్న పోలీసు పెట్రోలింగ్, ఇంటర్ సెప్టర్ వాహనాలు సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీ తిరుగుతాయి.

రెండు నియోజకవర్గాల్లో ఓటర్ల వివరాలు ఇలా..

సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటర్లు సోమవారం ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,99,651 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 1,55,352, మహిళలు 1,44,265, ఇతరులు 34 మంది ఉన్నారు. మొత్తం 245 పోలింగ్ బూత్‌లు సిద్ధం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 3,87,056 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 2,01,810, మహిళలు 1,85,220, ఇతరులు 22 మంది ఉన్నారు. 353 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.


డీఆర్‌సీ సెంటర్ నుంచి ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది


ఖైరతాబాద్‌లో ఓ పోలింగ్ బూత్ వద్ద పోలీసులు

ఓటర్లకు అందని పోలింగ్ స్లిప్‌లు

ఖైరతాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఓటర్లందరికీ జీహెచ్ఎంసీ ద్వారా ఓటరు స్లిప్‌లు పంచామని అధికారులు చెబుతున్నా.. చాలామంది తమకు అందలేదని ఫిర్యాదు చేస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఓటరు స్లిప్‌లు అందలేదని ఫిర్యాదులు అందాయి. స్లిప్‌లు అందకపోవడంతో ఓటు ఎక్కడ వేయాలి, ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేవా అనే సందేహంలో ఓటర్లు ఉన్నారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా

ఖైరతాబాద్‌లో మొత్తం 47 పోలింగ్ కేంద్రాల ప్రాంతాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. అక్కడ రాష్ట్ర పోలీసులతోపాటు సెంట్రల్ ఫోర్స్‌ను వినియోగించి సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టి సమస్యలు వస్తే వెంటనే ఫోర్స్ వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ముగ్గురు పోలీసులతోపాటు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు చెందిన అధికారుల ప్రత్యేక బృందాలు బందోబస్తులో పాల్గొననున్నాయి.


ఓటు హక్కుపై ఖైరతాబాద్ చౌరస్తాలో అవగాహన కల్పిస్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ సభ్యులు

అర్హులైన అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరూ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పి.రాజేంద్ర అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఖైరతాబాద్ చౌరస్తాలో ప్లకార్డులు పట్టుకొని అవగాహన కల్పించారు. సంస్థ ఆధ్వర్యంలో నగరంలో వివిధ ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నగరాలలోనే ఓటింగ్ శాతం తగ్గిపోతుందని, చదువుకున్నవారే ఓటు హక్కును వినియోగించుకోవడం లేదన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ప్రశ్నించే అవకాశం వస్తుందన్నారు. పోలింగ్ రోజు ఒక పిక్నిక్ రోజుగా భావించకుండా ఓటు వేయడమే కాకుండా, మీ చుట్టు పక్కల వారు కూడా ఓటు వేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో వృద్ధులు ఓటు వేసేందుకు ముందుకు వస్తున్నారని, నగరాల్లో ఉంటున్న, చదువుకున్న వారు ఓటు వేయకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శులు కె.దేవేందర్, కె.రమేశ్‌బాబు, మరియా ఆంథోని, నరేశ్, శ్రీలేఖ, అద్వైత, తదితరులు పాల్గొన్నారు.


స్వగ్రామాలకు వెళ్లేందుకు లక్డీకాపూల్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రజలు

స్వగ్రామాలకు ప్రజలు

- నగరంలో ఓటింగ్ శాతం తగ్గే అవకాశం

ఖైరతాబాద్, మే 12 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉంటున్న వారు ఓటు వేసేందుకు స్వగ్రామాలకు పయనమయ్యారు. శని, ఆదివారాల్లో లక్డీకాపూల్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ వారు రోడ్లపైనే బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడంతో అర్ధరాత్రి వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడంతో ప్రైవేట్ ట్రావెల్స్ వారు టికెట్లను రెట్టింపు ధరల్లో విక్రయించారు. నగరంలో ఉంటున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చాలామంది ఓటు వేసేందుకు వెళ్లగా, తెలంగాణలోని పలు జిల్లాలకు చెందిన వారు స్వగ్రామాల్లో ఓటు వేసేందుకు వెళ్లడంతో నగరంలో పోలింగ్ శాతం తగ్గే అవకాశాలున్నాయని అధికారులు భావిస్తున్నారు.


అన్నదానం చేస్తున్న డాక్టర్లు

మదర్స్ డే సందర్భంగా అన్నదానం

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): సుఖి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుఖీ సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శంకర్ మాట్లాడుతూ.. ప్రతినెలా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలో ప్రధాన ఆస్పత్రుల వద్ద రోగులు, సహాయకులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటామని తెలిపారు. అందులో భాగంగా మదర్స్ డే సందర్భంగా క్యాన్సర్ ఆస్పత్రి వద్ద 800 మందికి అన్నదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు సౌహిత్, రాంబాబు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్య ప్రదర్శన

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో ఆదివారం కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. చెన్నై నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రక్షా దేవనాధన్ నట్టైకురంజి రాగం వర్ణం, జయదేవ అష్టపది అంశాలను ప్రదర్శించి మెప్పించారు. కూచిపూడి నటి గురువర్యులు చూడామణి తన శిష్య బృందంచే మూషిక వాహన, పలుకే బంగారమాయే, అలరింపు, పుష్పాంజలి, నటేశకౌతం, జతిస్వరం, బ్రహ్మాంజలి, జయజనార్దన, ఆనంద తాండవం, మాతృ దినోత్సవం సందర్భంగా "అమ్మ" నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దీక్ష, అద్వితి, శ్లోక, నయోనికా, లాస్య, లక్ష, సమన్విత, హెత్విక అద్భుతంగా నృత్య ప్రదర్శన చేశారు.


చిన్నారుల నాట్య ప్రదర్శన

పట్టపగలు చొరబడి వృద్ధురాలి గొలుసు చోరీ

పంజాగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఓ ఆగంతుకుడు ఇంట్లోకి చొరబడ్డాడు. వంట గదిలో ఉన్న వృద్ధురాలిని బెదిరించి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ శాలివాహననగర్ కాలనీలో ఓ ఇంట్లో విజయలక్ష్మి(75) నివసిస్తోంది. ఆదివారం వంటగదిలో వంట చేస్తుండగా పక్కింట్లో నుంచి ఓ ఆగంతుకుడు గోడ దూకి ఆమె ఇంట్లోకి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో వంటగదిలో ఒంటరిగా ఉన్న విజయలక్ష్మిని బెదిరించాడు. ఆమె కేకలు వేయకుండా నోరు మూసేశాడు. వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. బాధితురాలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు ఇంటికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పంజాగుట్ట ఏసీపీ ఎస్. మోహన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ క్రాంతికుమార్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకుని ఆధారాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. ఆగంతుకుడు ఓ హాస్టల్‌లోకి వెళ్లడంతో, అతడి ఫోన్ నంబర్, చిరునామా సేకరించారు. సాంకేతిక ఆధారాలతో అతడిని అదుపులోకి తీసుకొని బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.


పరుగెత్తుతున్న ఆగంతుకుడు (సీసీ ఫుటేజీ)

మాయమాటలు చెప్పి బాలికపై లైంగిక దాడి

గర్భవతి అని తేలడంతో యువకుడిపై కేసు

అమీర్‌పేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు ఓ వ్యక్తి. కడుపునొప్పితో బాధపడుతున్న ఆమెను తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. ఈ ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఓ బాలిక వేరే రాష్ట్రంలో బాలికల వసతి గృహంలో ఉంటూ తొమ్మిదో తరగతి చదువుతోంది. సెలవులు ఉన్నప్పుడల్లా నగరంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వస్తుంటుంది. వారి పక్కింట్లో ఉంటున్న యువకుడి కన్ను ఆమెపై పడింది. బాలిక తరచూ పక్కింటికి వెళ్లి వారి బాబును ఎత్తుకునేది. ఇదే అదునుగా భావించిన యువకుడు బాలికకు మాయమాటలు చెప్పి లోబర్చుకున్నాడు. పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కడుపునొప్పిగా ఉందని బాలిక తల్లిదండ్రులకు చెప్పగా.. ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా గర్భవతి అని తేలింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శంకర జయంతిలో వేద పండితులు, విద్యార్థులు

వేదాలను దేశవ్యాప్తం చేసిన ఆది శంకరాచార్య

బంజారాహిల్స్, మే 12 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న జగద్గురు ఆది శంకరాచార్య జయంతి వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆదివారం విజయ శంకర దేశిక వేద పాఠశాల విద్యార్థులు, వేద పండితులు పాల్గొని వేద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతిపిన్న వయసులోనే వేదాలను, ఇతిహాస పురాణాలను, అష్టాదశ పురాణాలను నేర్చుకొని వాటిని దేశవ్యాప్తం చేశారని అన్నారు. హిందూ సమాజాన్ని జాగృతం చేసేందుకు ఎన్నో గొప్ప కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వేద పండితుడు జ్యోతిశ్చంద్ర శర్మ, ఈవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిసెల్లో అక్రమంగా మద్యం విక్రయం

- ముగ్గురికి రిమాండ్

చంపాపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మిధానీ డిపో సమీపంలో గుడిసెల్లో అక్రమంగా మద్య విక్రయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గుడిసెల్లో కిరాణాషాపు నిర్వహిస్తున్న జ్యోతి(38) విక్రయానికి నిల్వ ఉంచిన రూ.80,190 విలువైన 72.90 లీటర్ల మద్యం, మరో మహిళ కేతావత్ జ్యోతి(35), నేనావత్ తిరుపతి(30) ఇంటి నుంచి రూ. 3,412 విలువైన 13.65 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

అల్లాపూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 622.08 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ పార్టీకి చెందిన ముగ్గురు వ్యక్తులు పర్వత్‌నగర్ ప్రాంతంలో ఓ వైన్‌షాపులో మద్యం కొనుగోలు చేసి కూకట్‌పల్లి తరలిస్తున్నారు. కైతలాపూర్ బ్రిడ్జి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా కార్టన్లలో మద్యం సీసాలు ఉన్నాయి. ఆటోను, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ వినయ్, అనిల్, సైదులుపై కేసు నమోదు చేశారు.


మిధాని సమీపంలో గుడిసెల్లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు


బోరబండ శ్రీరామ్‌నగర్ చౌరస్తాలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

\- యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి

పుస్తకాల ఖని కోఠి

తక్కువ ధరకే పాత, కొత్తవి అందుబాటులో

- జీ మ్యాట్ నుంచి ఎంసెట్, పీజీ సెట్ ఎంట్రెన్స్ బుక్స్ వరకూ..
- 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో..
- కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, ఆబిడ్స్, ప్రధాన రోడ్లపై..

విద్య, ఉద్యోగాలు, పోటీ పరీక్షల కోసం కోటి ఆశలతో నగరానికి వచ్చే యువతకు ఆ ప్రాంతం దిక్సూచీ. అక్కడ ప్రతి పుస్తకం తక్కువ ధరకే అందుబాటులో ఉంటుంది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, రోడ్డుకు ఇరువైపులా వందల సంఖ్యలో షాపులు ఉన్నాయి. వాటిల్లో పాత పుస్తకాలతో పాటు కొత్త పుస్తుకాలు లభిస్తాయి. అందుకే వారికి 'కోఠి' విజ్ఞాన ఖనిలా మారింది.


ఆబిడ్స్ జీపీవో వద్ద పుస్తకాలు

మంగళ్‌హాట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న పలువురు అభ్యర్థులు కోఠికి వచ్చి వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్, టీఎస్‌పీఎస్సీ, యూపీఎస్సీ సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో షాపులలో విక్రయిస్తుంటారు. దాంతో సెలవు రోజులు, ఆదివారం వచ్చిందంటే చాలు కోఠి ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు, బడ్డీ కొట్ల వద్ద పుస్తకాల కోసం విద్యావంతులు, విద్యార్థులు బారులు తీరుతున్నారు.

ఆదివారం, సెలవు రోజుల్లో....

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మారు మూల పల్లెల నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న పలువురు అభ్యర్థులు కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్ రోడ్, ఆబిడ్స్ జీపీఓ ప్రధాన రహదారి, బ్యాంక్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులకు వారికి అవసరమైనవి కొనుక్కుని వెళ్తున్నారు. ఇక్కడి షాపుల నిర్వాహకులు కొత్త పుస్తకాలను నేరుగా ప్రింటర్స్, పబ్లిషర్స్ నుంచి తీసుకురావడం వల్ల డిస్కౌంట్ కూడా అధికంగానే ఇస్తుంటారు. మరి కొంతమంది వ్యాపారులు కొద్ది రోజుల పాటు పుస్తకాలను విద్యార్థులకు అద్దె (రెంట్)కు ఇస్తుంటారు. అందుకు వారు పూర్తి వివరాలతోపాటు కొంత మొత్తం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పుస్తకం అందుబాటులో..

జీ మ్యాట్, క్యాట్, సాట్, ఎంసెట్, పీజీ సెట్, లాసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్, ఎస్ఐఎస్‌టీ, నీట్, ఇంజనీరింగ్, ఏఐఐఎంఎస్, ఏఐఈఈడీ లాంటి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఐదారేళ్ల కిందటి ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఐఐటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫార్మసీ, డిగ్రీ, మెడిసిన్, మెకానికల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ పుస్తకాలు సైతం తక్కువ ధరలో దొరుకుతుంటాయి. ప్రముఖ కవులు రచించిన నవలలు, సాహిత్య పుస్తకాలు, గ్రంథాలు, కవితా సంపుటాలు, ఇలా అన్ని రకాల పుస్తకాలుకు కోఠి పెట్టింది పేరు.

సీజన్‌లో కాస్త లాభం ఉంటుంది



కోఠి ప్రధాన రహదారి ఫుట్‌పాత్‌పై పుస్తకాల దుకాణాలకు అనుమతి ఉన్న సమయంలో మంచి వ్యాపారం సాగేది. సబ్‌వేకు మార్చిన తరువాత తగ్గింది. సీజన్‌లో మాత్రం రద్దీ అధికంగా ఉంటుంది. విద్యార్థులతో పాటు ప్రముఖులు వస్తుంటారు. ప్రముఖ రచయితల పుస్తకాల కోసం వచ్చిన సమయంలో పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటాం.

\- అబ్దుల్, పుస్తకాల వ్యాపారి

విజ్ఞానానికి పెద్దపీట

విద్యా సంవత్సరం ఆరంభంలో జూన్, జూలై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు పుస్తకాలు కొనుక్కునేందుకు ఎక్కువగా కోఠికి వస్తుంటారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల సమయంలో పుస్తకాలు, పాత ప్రశ్నప్రతాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజులలో విద్యావంతులు, సాహితీ ప్రియులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, మరి కొంతమంది జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొనుగులు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇస్తుంటామని, అందుకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు.


కోఠి ప్రధాన రహదారిలో పుస్తకాల అమ్మకాలు

పాత పుస్తకాలు తిరిగి ఇక్కడికే..

పుస్తకాలు కొన్న తరువాత తమ అవసరం తీరిన వారు అవి ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో తిరిగి ఇక్కడి షాపుల వారికే అమ్మేస్తుంటారు. ముఖ్యంగా విద్యార్థులు తమ విద్యా సంవత్సరం పూర్తయిన తరువాత ఎంతో కొంతకు వ్యాపారులకు ఇచ్చేస్తుంటారు.

మెండుగా ఆదాయం

పాత పుస్తకాల దుకాణదారులకు ఆదాయం మెండుగా ఉంటుంది. రోజూ వేలల్లో వ్యాపారం సాగుతుందని, ముఖ్యంగా సెలవుదినమైన ఆదివారం రూ. 10వేల నుంచి 20 వేల వరకు వ్యాపారం జరుగుతుందని ఓ వ్యాపారి తెలిపారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

● సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల కోసం అధికారుల పకడ్బందీ ఏర్పాట్లు

● పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను తరలించిన అధికారులు



పోలింగ్ సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు



శిక్షణతరగతుల్లో పాల్గొన్న పోలింగ్ సిబ్బంది

బౌద్ధనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోసం ఎన్నికల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేశారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఐదు మున్సిపల్ డివిజన్లలో 220 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్ పార్లమెంట్ ఎన్నికల అధికారి హేమంత్ కేశవ్‌పాటిల్ ఆధ్వర్యంలో సహాయ ఎన్నికల అధికారులు ఎల్లారెడ్డి, సుభాష్‌రావులు పోలింగ్‌కు సంబంధించిన పర్యవేక్షణను పర్యవేక్షిస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన వసతులన్నీ ఇప్పటికే ఏర్పాటు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల సంఖ్య	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
	2,65,982	1,32,781	1,33,174	27

పదిహేను వందల మందితో..

ఎన్నికల నిర్వహణ కోసం ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్, అదర్ పోలింగ్ సిబ్బంది కలుపుకుని సుమారు పదిహేను వందలమందిని వినియోగించుకోనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు సిబ్బందిని నియమించారు. వీరితోపాటు పర్యవేక్షణ అధికారులు, సహాయ పర్యవేక్షణ అధికారులు, సంచారక బృందాలు, తదితర విభాగాల అధికారులు సిబ్బందిని మరో మూడువందల మందిని నియమించారు.

పూర్తయిన శిక్షణలు

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం ఎంపిక చేసిన ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు ఆదివారం శిక్షణా తరగతులు పూర్తయ్యాయి. రెండురోజులుగా వీరందరికీ ఉస్మానియా యూనివర్శిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈనెల 13న ఉదయం వీరు ఎలక్ట్రానిక్ మెషిన్‌లు స్వాధీనం చేసుకోవటం, పోలింగ్ పూర్తయ్యాక వాటిని సీజ్ చేసి, తిరిగి అప్పగించటం వరకు ఈవీఎంల పట్ల అధికారులకు శిక్షణా తరగతుల్లో అవగాహన కలిగించారు.

అంతా ఉస్మానియా యూనివర్శిటీ నుంచే

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల వ్యవహారాలన్నీ నామినేషన్లపర్వం ముగిసిన మీదట ఉస్మానియా యూనివర్శిటీ నుంచే కొనసాగుతున్నాయి. ఓయూ పరిధిలోని ప్రొఫెసర్ రాంరెడ్డి డిస్టెన్స్ ఎడ్యుకేషన్ భవనం నుంచి ఎన్నికల వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. ఈవీఎంలను ఇదే భవనంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరుస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఇక్కడి నుంచే పోలీస్ బందోబస్తుతో ప్రత్యేక వాహనాల్లో ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు డిస్టెన్స్ కేంద్రం నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.



పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు



వెస్లీ డిగ్రీ కళాశాలలోని కంటోన్మెంట్ ఉప ఎన్నికల డీఆర్‌సీ కేంద్రం వద్ద పోలింగ్ సామగ్రిని తీసుకుంటున్న ఎన్నికల సిబ్బంది



మడ్‌ఫోర్ట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓట్లు వేయడానికి ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్



డీఆర్‌సీ సెంటర్ నుంచి ఈవీఎంలను తీసుకువస్తున్న సిబ్బంది



నాంపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన ప్రయాణికురాలికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు

ప్రయాణికురాలికి ప్రపంచ తల్లుల దినోత్సవ శుభాకాంక్షలు

అడ్డగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తల్లుల దినోత్సవం సందర్భంగా ఆదివారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన మహిళ చెంత ఉన్న చిన్నారిని ఆప్యాయంగా ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు పలకరించి ప్రయాణికురాలికి శుభాకాంక్షలు తెలిపారు. రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ డెబస్మితి బెనర్జీ ఆదేశాల మేరకు మహిళలకు భద్రతకు పెద్ద పీట వేస్తున్నామని నాంపల్లి ఆర్పీఎఫ్ సీఐ కల్పన తెలిపారు.



శంకర జయంతి సందర్భంగా సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దేవాదాయ సహాయ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణాధికారి గుత్తా మనోహర్ రెడ్డి, మహంకాళి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, వేద పండితులు.

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి



అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ నాయకుడు పలిమదన్‌ను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మదన్‌కు కిషన్‌రెడ్డి పరామర్శ

రాంగోపాల్‌పేట్, మే 12 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న నల్లగుట్టకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త పలిమదన్‌ను నల్లగుట్ట మెక్లోడ్‌గూడలోని ఆయన ఇంటికి వెళ్లి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మదన్‌ను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మదన్ ఆరోగ్యానికి సంబంధించి వైద్య సహాయానికి కావలసిన అన్ని చర్యలను తీసుకుంటానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంత్రితోపాటు బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, రాష్ట్ర సోషల్ మీడియా సభ్యులు, గోల్కొండ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి అనీష్‌వర్మ ఉన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతు మరణించాడు. ఈ సంఘటన సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సీతాఫల్‌మండి - మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌ల మధ్యలో ఆదివారం సాయంత్రం 4.30 గంటల సమయంలో గుర్తుతెలియని 75ఏళ్ల వ్యక్తి రైలు ఢీకొని తీవ్ర గాయాలతో కంకరాళ్ల వద్ద అపస్మారక స్థితిలో పడిపోయి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధుడిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా, అదే రోజు 5.50 గంటలకు చికిత్స పొందుతు మరణించాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిస్తే వెంటనే సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరిన చిలుకానగర్ మాజీ కార్పొరేటర్ గొపు సరస్వతి సదానంద్

బీజేపీలో చేరిన చిలుకానగర్ మాజీ కార్పొరేటర్

ఉప్పల్, మే 12 (ఆంధ్రజ్యోతి): చిలుకానగర్ మాజీ కార్పొరేటర్ గొపు సరస్వతి సదానంద్ దంపతులు, మరో ఉద్యమ నాయకుడు కృష్ణ నాయక్ ఆదివారం మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఇరవైరోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినా పార్టీ నుంచి ఎటువంటి సంప్రదింపులు జరపలేదన్నారు. ఉద్యమకారుడైన ఈటల రాజేందర్‌తో కలిసి నడిచేందుకు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఒంటెద్దు పోకడతో వెళ్తూ పార్టీలో మొదటి నుంచి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వడం లేదని ఆరోపించారు.. బీజేపీ నాయకులు శ్రీనివాస్ శర్మ, కంచర్ల భరత్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

తుకారాంగేట్ పీఎస్ పరిధిలో భారీ బందోబస్తు

●ఏఎస్ఐలకు గన్‌లు అందజేత



గన్‌తో గస్తీ తిరుగుతున్న ఏఎస్సై వెంకటేశ్వర్లు

అడ్డగుట్ట, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపధ్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో గస్తీ తిరిగేందుకు, ఏ సమయంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు నార్త్‌జోన్ పరిధిలో ఉన్న ఏఎస్సైలకు ప్రత్యేకంగా గన్‌లు అందజేశారు.



మాతృమూర్తులను సన్మానిస్తున్న మేడ్చల్‌మల్కాజిగిరి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్

ఘనంగా మదర్స్ డే

మల్కాజిగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని మల్కాజిగిరిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో మాతృమూర్తులకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బొల్లారం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సాధారణ ఎన్నికలకు కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం జరుగుతున్న ఎన్నికలు తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 16 పోలింగ్ స్టేషన్‌లతో పాటు 33 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఓటర్లకు, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని వసతులు కల్పించారు. దీంతోపాటు సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంచనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. అదనంగా 100 మంది ఫోర్స్‌ను బయట నుంచి తెప్పించి పోలింగ్ స్టేషన్‌ల వద్ద పహారా కాస్తున్నారు. ఎండలు అధికంగా ఉన్న నేపధ్యంలో కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బయట టెంట్లు ఏర్పాటు చేశారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను సైతం రంగంలోకి దించారు. తిరుమలగిరి పరిధిలోని మార్నింగ్ స్టార్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను సమస్యాత్మక స్టేషన్‌గా గుర్తించారు. అక్కడ ఎక్కువ ఫోర్స్‌ను అందుబాటులో ఉంచారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ ద్వారా అన్ని పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించనున్నామని తిరుమలగిరి పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆదివారం తెలిపారు. ఓటర్లు తమతమ ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి చర్యలు చేపట్టామని తెలిపారు.



ఎన్నికల నేపథ్యంలో సికింద్రాబాద్ వెస్లీ హైస్కూలులో ఏర్పాటు చేసిన ఈవీఎం యంత్రాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసిన గోపాలపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ సిబ్బంది

- (అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి)

పుస్తకాల ఖని 'కోఠి'

తక్కువ ధరకే పాత, కొత్త పుస్తకాలు అందుబాటులో

- జీ మ్యాట్ నుంచి ఎంసెట్, పీజీ సెట్ ఎంట్రెన్స్ బుక్స్ వరకూ...
- 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో...
- కోఠిలోని సబ్‌వే, సుల్తాన్ బజార్, బ్యాంక్ స్ట్రీట్, ఆబిడ్స్, ప్రధాన రోడ్లపై..



ఆబిడ్స్ జీపీవో వద్ద పుస్తకాలు

మంగళ్‌హాట్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో నగరానికి వచ్చి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్న పలువురు ఉద్యోగార్థులు కోఠికి వచ్చి వారికి నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు.ఇక్కడ ఇంజనీరింగ్, మెడిసిన్, టీఎస్‌పీఎస్సీ, యూపీఎస్సీ, సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు 40 నుంచి 60 శాతం డిస్కౌంట్‌తో షాపులలో విక్రయిస్తుంటారు. దాంతో సెలవు రోజులు, ఆదివారం వచ్చిందంటే చాలు కోఠి ప్రధాన రహదారుల్లోని ఫుట్‌పాత్‌లు, బడ్డీ కొట్ల వద్ద పుస్తకాల కోసం విద్యావంతులు, విద్యార్థులు బారులు తీరుతున్నారు.

ఆదివారం, సెలవు రోజుల్లో....

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మారు మూల పల్లెల నుంచి నగరానికి వచ్చి హాస్టల్‌లో ఉంటూ పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న పలువురు విద్యార్థులు కోఠిలోని సబ్‌వే, సుల్తాన్‌బజార్ రోడ్, ఆబిడ్స్ జీపీఓ ప్రధాన రహదారి, బ్యాంక్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఉన్న షాపులకు వారికి అవసరమైనవి కొనుక్కుని వెళ్తున్నారు. ఇక్కడి షాపుల నిర్వాహకులు కొత్త పుస్తకాలను నేరుగా ప్రింటర్స్, పబ్లిషర్స్ నుంచి తీసుకురావడం వల్ల డిస్కౌంట్ కూడా అధికంగానే ఇస్తుంటారు. మరి కొంతమంది వ్యాపారులు కొద్ది రోజులపాటు పుస్తకాలను విద్యార్థులకు అద్దె (రెంట్)కు ఇస్తుంటారు. పూర్తి వివరాలతోపాటు కొంత మొత్తం నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ప్రతి పుస్తకం అందుబాటులో...

జీ మ్యాట్, క్యాట్, సాట్, ఎంసెట్, పీజీ సెట్, లాసెట్, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్ ఎన్ఐఎఫ్‌టీ, నీట్, ఇంజనీరింగ్, ఏఐఐఎంఎస్, ఏఐఈఈడీ లాంటి పోటీ పరీక్షల పుస్తకాలతోపాటు ఐదారేళ్ల కిందటి ప్రశ్నపత్రాలు కూడా అందుబాటులో ఉంటాయి. ఐఐటీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, బీఎస్సీ, ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఫార్మసీ, డిగ్రీ, మెడిసిన్, మెకానికల్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్‌తో పాటు పీహెచ్‌డీసీ పుస్తకాలు సైతం తక్కువ ధరలో దొరుకుతుంటాయి. ప్రముఖ కవులు రచించిన నవలలు, సాహిత్య పుస్తకాలు, గ్రంథాలు, కవితా సంపుటాలు, ఇలా అన్ని రకాల పుస్తకాలుకు కోఠి పెట్టింది పేరు.

విజ్ఞానానికి పెద్దపీట...

విద్యా సంవత్సరం ఆరంభంలో జూన్, జులై, ఆగస్టు నెలల్లో విద్యార్థులు పుస్తకాలు తీసుకునేందుకు ఎక్కువగా కోఠికి వస్తుంటారు. వార్షిక, సప్లిమెంటరీ పరీక్షల సమయంలో విద్యార్థులు పుస్తకాలు, పాత్ర ప్రశ్నప్రతాలు కొనుగోలు చేస్తుంటారు. సాధారణ రోజులలో విద్యావంతులు, సాహితీ ప్రియులు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి, మరికొంతమంది జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్, సైన్స్‌కు సంబంధించిన పుస్తకాలు కొనుగులు చేస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. అలాంటి వారి కోసం ప్రత్యేకంగా పబ్లిషర్స్ నుంచి తెప్పించి ఇస్తుంటామని, అందుకు ఎక్కువ ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు.